క్లుప్తంగా

నూతన బోరు ఏర్పాటు



బోరు వేస్తున్న దృశ్యం

సైదాపురం: మండలంలోని అనంతమడుగు అరుంధతీయ వాడలో ఎంపీటీసీ వెంకటరమణయ్య ఆధ్వర్యంలో ఆదివారం నూతన బోరును భూమిపూజ చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మండల పరిషత్ నిధులతో ఈ బోరును ఏర్పాటు చేశామన్నారు. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఈ బోరు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

రూ.10 లక్షలు పరిహారం ఇవ్వాలి



మాట్లాడుతున్న నేతలు

చిల్లకూరు: భవన నిర్మాణ పనులకు వచ్చి ప్రమాదవశాత్తు గోడ కూలి మృతి చెందిన మృతుని కుటుంబానికి రూ 10 లక్షలు పరిహారం ఇవ్వాలని ఆదివారం సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. సీపీఎం కార్యాలయంలో ఆదివారం నేతలు విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి గూడూరు తాళ్లమ్మగుడి సమీపంలో ఓ భవన యజమాని భవన నిర్మాణ కూలీలను పిలిపించి పనులు చేయిస్తున్నారని తెలిపారు. ఆ సమయంలో కూలీకి వచ్చిన తిమ్మనగారి పాళెంకు చెందిన పాపయ్య అనే వృద్ధుడు గోడ కూలి మృతిచెందాడన్నారు. అలాగే నావూరయ్య తీవ్రంగా గాయపడ్డాడు. భవన యజమాని కనీసం పట్టించుకోకుండా ఉన్నారని అన్నారు. పోలీసులు పూర్తి విచారణ చేసి భవన యజమానిపై కేసు నమోదు చేసి బాధిత కుటుంబానికి రూ.10 లక్షల నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నేతలు జోగి శివకుమార్, బీవీ రమణయ్య, ఎస్ సురేష్, పుట్టా శంకరయ్య, రఫీ, ఆర్ఎస్‌కే జిలానీ, బి.చంద్రయ్య పాల్గొన్నారు.

ఘనంగా వసంత పంచమి పూజలు



ప్రత్యేక అలంకరణలో దుర్గామల్లేశ్వరి దేవి

నాయుడుపేట టౌన్: మండల పరిధిలోని తిమ్మాజికండ్రిగ గ్రామ సమీపంలో స్వర్ణముఖి నది ఒడ్డున ఉన్న దుర్గామల్లేశ్వరి దేవి ఆలయంలో ఆదివారం వసంత పంచమి సందర్భంగా ప్రత్యేక పూజలను చేశారు. అమ్మవారికి అభిషేకాలు చేసి, ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయం వద్ద సరస్వతి పూజ, భక్తుల ఆధ్వర్యంలో సాముహిక విద్యాభ్యాస కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

సాగరమాల లారీలు అడ్డగింత



లారీలను అడ్డుకుంటున్న గ్రామస్తులు

చిల్లకూరు: సాగరమాల రహదారి పనుల కోసం వినియోగించే లారీలను ఆదివారం చేడిమాల గ్రామస్తులు అడ్డుకుని నిలిపి వేశారు. సాగరమాల రోడ్డు పనులు ప్రారంభించిన సమయంలోనే వరగలి వరకు ఉన్న ఆర్అండ్‌బీ రోడ్డును మరమ్మతులు చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చేసిన తరువాతనే లారీలు, టిప్పర్లను కాంక్రీట్ మిషన్లను తిప్పడం జరుగుతుందని కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులు ప్రజలకు హామీ ఇచ్చారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక టిప్పర్లు, లారీలను తిప్పడంతో రోడ్డు పూర్తిగా ధ్వంసమై దుమ్ము లేస్తోంది. ఈ క్రమంలోనే శనివారం సాక్షిలో 'చేడిమాలలో దుమ్ము రేపుతున్నారు' అనే కథనం ప్రచురితమైంది. సంబంధిత అధికారులు స్పందించకపోవడంతో చేడిమాల గ్రామస్తులు లారీలు, టిప్పర్లను అడ్డుకుని నిలిపేశారు. దీంతో రెండు గంటలకు పైగా ఇరువైపులా కిమీల మేర లారీలు, టిప్పర్లు నిలిచిపోయాయి. విషయం తెలిసి సాగరమాల ప్రతినిధులు అక్కడికి చేరుకుని దుమ్ము లేయకుండా నీరు పడతామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

గాయపడ్డ యువకుడి మృతి



శివ (ఫైల్)

దక్కిలి: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న ఓ యువకుడు ఆదివారం మృతిచెందాడు. గత నెలలో వెలికల్లు గ్రామానికి చెందిన చెలికం శ్రీనివాసులురెడ్డి, పొట్టాశివ అనే ఇద్దరు బైక్‌లో రాపూరు నుంచి వెలికల్లు గ్రామానికి వెళుతుండగా రాపూరు–వెంకటగిరి జాతీయ రహదారిలోని సిద్ధవరం గ్రామం వద్ద రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఈప్రమాదంలో చెలికం శ్రీనివాసులురెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. శివ తీవ్రగాయాలతో అప్పటి నుంచి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతిచెందాడు.

దర్జాగా కబ్జా

నాయుడుపేట మండలంలోని మేనకూరు సెజ్ పరిధిలో భూముల ధరలు రూ.కోట్లు పలుకుతున్నాయి. దీంతో అక్రమార్కుల కన్ను ప్రభుత్వ, కాలువ, చెరువు పొరంబోకు భూములపై పడింది. వారికి అధికార పార్టీ నేతల అండదండలు పుష్కలంగా ఉండడంతో ఇష్టారాజ్యంగా భూములను ఆక్రమించుకుంటున్నారు. ఈ విషయం తెలిసినా అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తుండడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- 50 ఏళ్లుగా వున్న మామిడి కాలువ రోడ్డు మూసివేతకు చర్యలు
- అధికార పార్టీ నేతల అండతో రెచ్చిపోతున్న అక్రమార్కులు



మామిడి కాలువ తాగునీటి పంపు షెడ్డు వద్ద మట్టి తరలించి ఆక్రమణలు చేస్తున్న దృశ్యం

నాయుడుపేట టౌన్ : దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ నాయుడుపేట మండలంలోని మేనకూరులో సెజ్ ఏర్పాటు చేశారు. ఇక్కడ వందలాది పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. ఇతర ప్రాంతాలకు చెందిన వారు ఇక్కడ ఉద్యోగాలు చేస్తున్నారు. వారు నాయుడుపేటలో ఇళ్లు అద్దెకు తీసుకుని నివాసం ఉంటున్నారు. దీంతో ఇక్కడి స్థలాలకు డిమాండ్ పెరిగింది. ఎకరా కోటికి పైగా ధర పలుకుతోంది. ఈక్రమంలో కొందరు అధికార పార్టీ నాయకుల అండతో మామిడి కాలువ స్థలాన్ని ఆక్రమించుకుంటున్నారు. అర్ధరాత్రి టిప్పర్లతో మట్టి తీసుకొచ్చి కాలువను పూడ్చివేస్తున్నారు. మామిడి కాలువ పక్కనే వున్న మంచినీటి సరఫరా పథకానికి చెందిన మోటార్ పంపు షెడ్డును సైతం తొలగించేందుకు పూనుకున్నారు. అలాగే మేనకూరులో మామిడి కాలువ వద్ద ఉన్న బ్రిడ్జి సమీపంలోని స్థలం పట్టా భూమిగా చెబుతూ వెంకటగిరి ప్రాంతానికి చెందిన వారు ఆక్రమించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అలాగే భీమవరం గ్రామానికి వెళ్లే రోడ్డు పక్కన స్థలాన్ని ఆక్రమించుకుని నిర్మాణాలు చేపట్టారు. మేనకూరు నుంచి భీమవరం గ్రామం వైపు వెళ్లే రోడ్డును సైతం మూసేందుకు సిద్ధమయ్యారు. దీనిపై స్థానిక టీడీపీ నాయకుడు, మాజీ జెడ్పీటీసీ పేరంశెట్టి శ్రీరామ్‌ప్రసాద్ కొద్ది రోజుల క్రితం సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీతో కలిసి కలెక్టర్ వెంకటేశ్వర్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. ఈ విషయంపై తహసీల్దార్ రాజేంద్రను వివరణ కోరగా మామిడి కాలువను సర్వే చేసి రికార్డుల ప్రకారం విస్తరణ ఎంత వుంది అని నిర్ధారిస్తామన్నారు. ఆక్రమణలకు పాల్పడినట్టు తేలితే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.



మేనకూరు: మామిడి కాలువ బ్రిడ్జి సమీపంలో మట్టి తరలించి ఆక్రమిస్తున్న దృశ్యం

వైభవం.. సుబ్రహ్మణ్యస్వామి శాంతి కల్యాణం



అలంకరణలో స్వామి అమ్మవార్లు

చిట్టమూరు: మండలంలోని మల్లాం గ్రామంలో వెలసిన వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం వసంత పంచమి సందర్భంగా స్వామి, అమ్మవార్ల శాంతి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారి మూల విరాట్‌కు అభిషేకాలు నిర్వహించి విశేష అలంకరణ చేశారు. స్వామి, అమ్మవార్లను పుష్పాలతో అలంకరించి శాంతి కల్యాణాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కుజ దోషం ఉన్న వారు ఆలయంలో హోమాలు చేశారు. భక్తులు స్వామిఅమ్మవార్లను దర్శించుకుని పునీతులయ్యారు. వడ్డికండ్రిగకు చెందిన వీరాస్వామి, శకుంతలమ్మ ఉభయకర్తలుగా వ్యవహరించారు.

నేడు తుమ్మూరులో ప్రత్యేక వైద్యశిబిరం

నాయుడుపేట టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని తుమ్మూరు గ్రామంలో సోమవారం ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా ఆదివారం తెలిపారు. తుమ్మూరు అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యులతో పాటు, గొట్టిప్రోలు పీహెచ్‌సీ పరిధిలోని వైద్యులు పాల్గొని వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. వైద్య శిబిరాన్ని తుమ్మూరులోని 25 వార్డు కౌన్సిలర్ పసలచిన పెంచలయ్య ఇంటి సమీపంలో ఏర్పాటు చేస్తున్నట్లు కమిషనర్ వెల్లడించారు. ఈ అవకాశాన్ని తుమ్మూరుతోపాటు చుట్టు పక్క ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బీసీ నూతన కమిటీ ఎంపిక



నూతన కమిటీతో నేతలు

చిల్లకూరు: గూడూరు నియోజకవర్గం బీసీ నాయకులు నూతన కమిటీని ఆదివారం ఎంపిక చేశారు. గూడూరు రెండవ పట్టణంలోని కోర్టు ప్రాంగణానికి సమీపంలో జరిగిన నూతన కమిటీ ఎన్నికను తిరుపతి జిల్లా బీసీ సంఘాల అధ్యక్షుడు సీనియర్ న్యాయవాది ఓల్లూరు రాజమాణ్యికం ఆధ్వర్యంలో పలు బీసీ కులాలకు చెందిన ప్రతినిధులు పాల్గొని నూతన కమిటీని ఎంపిక చేశారు. వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలకు సముచిత స్థానం కల్పిస్తున్నట్లు మభ్య పెడుతున్నాయని, దీనిని దృష్టిలో ఉంచుకుని రాన్ను స్థానిక సంస్థ ఎన్నికల్లో బీసీల సత్తా చూపించేలా కమిటీలను ఎంపిక చేస్తామని అన్నారు. అలాగే బీసీ కులగణనను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం రాష్ట్ర బీసీ సమన్వయ కమిటీ కన్వీనర్‌గా నాశిన భాస్కర్‌గౌడ్, గూడూరు నియోజకవర్గ చైర్మన్‌గా జమాల్, కన్వీనర్‌గా ఎల్వీ సుబ్బయ్య, కో కన్వీనర్లుగా మంగళపరు గురునాథం, తిరగాబత్తిన శేషయ్యగౌడ్‌లను ఎన్నుకున్నారు. న్యాయవాదులు జయచంద్ర, అజయ్‌కుమార్ జీవీ రమణయ్య పాల్గొన్నారు.

కండలేరులో 54.5 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం 54.5 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి 150 క్యూసెక్కుల నీరు వస్తుందని తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 650, లోలెవల్ కాలువకు 70, హైలెవల్ కాలువకు 170, మొదటి బ్రాంచ్ కాలువకు 70 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

వాకాడులో నగర సంకీర్తన



నగర సంకీర్తన చేస్తున్న భక్తులు

వాకాడు: స్థానిక ఆనందసాయి నిలయం భక్తులు ఆదివారం సాయిబాబా నగర సంకీర్తన ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులు గ్రామంలో బాబా గీతాలాపన చేశారు. సాయిబాబా సత్సంగ ప్రవచన కర్త విజయలక్ష్మి మాట్లాడుతూ జూన్‌లో 6 నుంచి 8 వరకు వాకాడులో నిర్వహించే జాతీయ తెలుగు సాయి భక్త సమ్మేళన కార్యక్రమం జరిగిందన్నారు. ముందుగా గ్రామంలో భారీ నగర సంకీర్తన, భక్తుల నుంచి విరాళాలు సేకరించామన్నారు. మొట్టమొదటి సారిగా వాకాడులో జాతీయ స్థాయిలో సాయిభక్త సమ్మేళనం నిర్వహిస్తున్నారన్నారు. దేశం నలు మూలల నుంచి వందలాది సద్గురువులు వాకాడుకు వస్తారని అన్నారు.

వెలమ సంఘం నూతన కార్యవర్గం



మాట్లాడుతున్న వెలమ సంఘ నాయకులు

నాయుడుపేట టౌన్: పుదూరు గ్రామంలోని మినీ కల్యాణ మండపంలో ఆదివారం సాయంత్రం వెలమ సంక్షేమ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నాయుడుపేట డివిజన్ వెలమ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు డాక్టర్ రంగినేని కృష్ణయ్య వెల్లడించారు. నాయుడుపేట డివిజన్ గౌరవ అధ్యక్షుడిగా వేణుంబాక మునస్వామి నాయుడు, అధ్యక్షుడిగా చింతకాని మధుసూధన్‌రావు, సంయుక్త కార్యదర్శులుగా పోట్లపూడి రాజేష్, శేఖర్‌నాయుడు, సంయుక్త కార్యదర్శులుగా నేలవల్లి రామచంద్రనాయుడు, భాస్కర్, రాధాకృష్ణమ నాయుడు, ట్రెజరర్‌గా నేలవల్లి మునికృష్ణలను ఎన్నుకున్నట్లు తెలిపారు. వెలమల సంక్షేమ కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యమిస్తామని ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో బిరదవాడ మునిచంద్ర, వివిధ మండలాలకు చెందిన వెలమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఇసుక రీచ్ రద్దు చేయండి



మాట్లాడుతున్న చిందేపల్లి మధుసూదన్‌రెడ్డి

పెళ్లకూరు: తాగు, సాగునీటికి మూలాధారమైన స్వర్ణముఖి నదిలో ఇసుక రీచ్‌ను వెంటనే రద్దు చేయాలని వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి, ఎన్ఆర్ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు చిందేపల్లి మధుసూదన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం రాత్రి పుల్లూరులోని ఆయన నివాసం వద్ద మీడియాతో మాట్లాడారు. కలవకూరు వద్ద స్వర్ణముఖి నదిలో ఇసుక రీచ్ ఏర్పాటు కోసం సూళ్లూరుపేట ఆర్డీఓ కిరణ్మయి రైతులు సాగు చేస్తున్న వరి పైరును యంత్రాలతో ధ్వంసం చేయించడం దారుణమన్నారు. అధికార పార్టీ నేతలకు అనుకూలంగా అధికారులు అత్యుత్సాహం ప్రదర్శిస్తూ రైతులకు అన్యాయం చేయడం మంచిది కాదన్నారు. ఈ విషయమై రైతుల తరపున కోర్టును ఆశ్రయిస్తామన్నారు. పుల్లూరు నుంచి తాళ్వాయిపాడు వరకు స్వర్ణముఖి నదికి ఇరువైపులా వందల వ్యవసాయ బోర్లు, అనేక తాగునీటి పథకాలు ఉన్నాయన్నారు. ఇసుక రీచ్‌తో ఈ ప్రాంతం ఎడారిగా మారే ప్రమాదం ఉందన్నారు. జిల్లా కలెక్టర్ పూర్తి స్థాయిలో పరిశీలించి ఇసుక రీచ్‌ను రద్దు చేయాలని కోరారు. అలాగే పచ్చని వరిపైరును యంత్రాలతో ధ్వంసం చేయించిన ఆర్డీఓ తీరుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు వెంకటేశ్వర్లు, మణి నాయుడు పాల్గొన్నారు.


గుంతలు.. అధికారుల కళ్లకు గంతలు



రాపూరు–పెంచలకోన జాతీయ రహదారిపై తవ్విన గుంత

రాపూరు: రాపూరు–పెంచలకోన 565 జాతీయ రహదారిలో పలుచోట్ల దెబ్బతిన్న ప్రాంతాల్లో మరమ్మతులు చేయడానికి అధికారులు పెద్ద పెద్ద గుంతలు తవ్వారు. వాటిని పూడ్చకుండా అలాగే వదిలేశారు. దీంతో రాత్రిళ్లు అవి కనిపించడం లేదు. దీంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుంతలను పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.

సర్కారు సొమ్ము.. రాళ్లపాలు



కొక్కుపల్లివారికండ్రిగ ప్రాథమిక పాఠశాల భవనం దుస్థితి



శిథిలావస్థకు చేరుకుంటున్న మరుగుదొడ్ల నిర్మాణం

దొరవారిసత్రం: శ్రీధనమల్లి పంచాయతీ కొక్కుపల్లి వారికండ్రిగ గ్రామంలోని విద్యార్థుల సౌకర్యార్థం అప్పటి టీడీపీ (2015–16) హయాంలో అదనపు పాఠశాల భవనం, మరుగుదొడ్లను లక్షలు వెచ్చించి నిర్మించారు. సకాలంలో నిధులు కేటాయించకపోవడంతో ఈ రెండు నిర్మాణాలు శ్లాబ్ స్థాయికి వచ్చి అర్ధంతరంగా ఆగిపోయాయి. అవి ప్రస్తుతం క్రమేపీ దెబ్బతింటూ శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. ఇవి ఎప్పుడు కూలిపోతాయోనని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. అదనపు భవనం నిర్మాణం కోసం రూ.5 లక్షలు, మరుగుదొడ్డి నిర్మాణానికి రూ.70వేలు అప్పటిలోనే మంజూరు చేసినా ఎలాంటి ప్రయోజనం చేకూరలేదు. ప్రస్తుతం ఈ అసంపూర్తి అదనపు పాఠశాల భవనం పక్కనే ఉన్న భవనంలో 10 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఈ భవనం కూడా దుస్థితికి చేరుకోవడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని పిల్లల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి విద్యార్థులకు ప్రమాదం జరగక ముందే అదనపు భవనం పనులు పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

చైర్మన్ గిరీ ఎవరికో?

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలల కాలం పూర్తి అయినప్పటికీ దేవదాయశాఖ పరిధిలోని ఆలయాలకు కమిటీలు వేయడం లేదు. సూళ్లూరుపేట పట్టణంలోని కాళంగి నదీ తీరాన వెలసియున్న చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ పదవి ఎవరిని వరిస్తుందో తెలియడం లేదు. – సూళ్లూరుపేట

- శ్రీచెంగాళమ్మ ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ నియామకంపై సస్పెన్స్
- అర్హులకు బోర్డు సభ్యత్వం ఇవ్వలేదనే ఆరోపణలు



శ్రీచెంగాళమ్మ పరమేశ్వరి ఆలయం

సూళ్లూరుపేట పట్టణంలో టీడీపీలో రెండు గ్రూపులు స్పష్టంగా ఉన్నాయి. ఒకటి కొండేపాటి గంగాప్రసాద్ వర్గం, రెండోది వేనాటి సతీష్‌రెడ్డి గ్రూపు. ఈ రెండు గ్రూపుల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేంతగా విభేదాలు ఉన్నాయి. ఇటీవల జరిగిన ఫ్లెమింగో ఫెస్టివల్ దీనికి వేదికగా మారింది. ఈ ఫెస్టివల్‌ను అధికారులే చేసినప్పటికీ రాజకీయ నాయకులు ఎంట్రీ ఇచ్చారు. ఆ కోవలో వేనాటి సతీష్‌రెడ్డికి తగిన ప్రాధాన్యం ఇవ్వలేదనే ఆరోపణలు ఉన్నాయి. వైఎస్సార్‌సీపీ, బీజేపీ నాయకులకు ఇచ్చిన గౌరవం కూడా సతీష్‌రెడ్డికి ఇవ్వలేదని ఆయన వర్గీయులు ఎవరూ కూడా ఫెస్టివల్‌లో కనిపించలేదు. దీంతో ఈ రెండు గ్రూపులు నువ్వానేనా అన్నట్టుగా ఉన్న నేపథ్యంలో కొండేపాటి శిబిరం నుంచి సీనియర్ న్యాయవాది తిరుమూరు సుధాకర్‌రెడ్డి పేరు బాహాటంగా వినిపిస్తోంది. అయితే ఆయనకు చైర్మన్ పదవి ఇవ్వడానికి కొండేపాటి గ్రూపులోనే చాలామందికి ఇష్టం లేకపోవడంతో సాగదీస్తున్నారు. అదే విధంగా వేనాటి సతీష్‌రెడ్డి కూడా నేరుగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి లోకేష్‌తో సంబంధాలు నెరుపుతున్నారు. నేరుగా వారి నుంచే ఆలయ చైర్మన్‌గా తెచ్చుకోవాలనే ఆలోచనతో ఉన్నారని కూడా తెలుస్తోంది.

సభ్యుల ఎంపికలోనూ అవకతవకలు

శ్రీచెంగాళమ్మ ట్రస్టు బోర్డు సభ్యుల నియామకంలోనూ కూటమి నాయకులు ఒక్కొక్కరు ఒక్కో జాబితాను సిద్ధం చేసుకుని అధిష్టానానికి సమర్పించారు. ముఖ్యంగా ఆలయానికి వంశ పారంపర్య ధర్మకర్తలుగా అరవభూమి వంశస్తులు ఉండేవారు. వారి వంశంలో ఒకరికి కనీసం బోర్డు సభ్యులుగా ఇవ్వాల్సి ఉంది. ముఖ్యంగా తిరునాళ్లలో అమ్మవారిని మోసేది కావలి వీధిలోని ముదిరాజ్‌లు, సుడిమాను వద్ద గంగపెట్టి వీరతాళ్లు వేసేది యాదవులు, అమ్మవారి తిరునాళ్లలో సుడిమాను నాటేది కోళ్లమిట్టకు చెందిన వన్నియర్లు, అమ్మవారికి పుట్టింటి సారెలు తెచ్చేది గొల్లలములువు గ్రామం రెడ్డివార్లు, కస్వారెడ్డిపాళెం, మన్నారుపోలూరు నుంచి యాదవులు తెస్తారు. ఈ ప్రాంతాల్లోని వారికి బోర్డు సభ్యులుగా ఇవ్వడమనేది గతంలో ఆనవాయితీగా ఉండేది. ఆలయంలో రాజకీయాలు బాగా ముదిరిపోవడంతో రాజకీయంగా బోర్డు సభ్యులను కేటాయించే సంస్కృతి వచ్చింది. అసలు బోర్డులో ఆలయానికి సంబంధం ఉన్నవారు లేకపోవడం విమర్శలకు తావిస్తోంది.

ఒకే సామాజిక వర్గానికేనా?

శ్రీచెంగాళమ్మ ట్రస్టు బోర్డు ఎప్పుడూ రెడ్డి సామాజిక వర్గానికేనా..? ఎస్సీ, బీసీ సామాజిక వర్గాల నేతలకు ఎందుకివ్వరనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. టీడీపీ పదవుల విషయానికొచ్చేసరికి ఈ రెండు సామాజిక వర్గాలు ఎందుకు గుర్తుకు రావని కూడా ప్రశ్నిస్తున్నారు. పదవుల విషయానికొస్తే మాత్రం ఎస్సీ, బీసీలను విస్మరించడం టీడీపీకి అలవాటుగా మారిపోయింది.